సాక్షి
పార్వతీపురం మన్యం

ఆదివారం । 7 । సెప్టెంబర్ । 2025

సురేష్, విక్రాంత్‌లకు అదనపు బాధ్యతలు



సురేష్‌బాబు



విక్రాంత్

సాక్షి ప్రతినిధి, విజయనగరం: వైఎస్సార్‌సీపీ సంస్థాగత బలోపేతంలో భాగంగా పార్టీ అధిష్టానం పార్లమెంటరీ నియోజకవర్గాలకు కార్యదర్శులను నియమించింది. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను పాతపట్నం, పాలకొండ నియోజకవర్గాలకు, మరో ఎమ్మెల్సీ పెనుమత్స సూర్యనారాయణ రాజు (సురేష్ బాబు)ను గజపతినగరం, ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గాలకు కార్యదర్శిగా నియమించింది. వీరు పార్టీ కేంద్ర కార్యాలయాన్ని సమన్వయం చేసుకుంటూ పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలు, పార్లమెంటరీ నియోజకవర్గాల పరిశీలకులకు సహాయకారిగా వ్యవహరిస్తారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తారు. వీరి నియామకంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తంచేశాయి.

ఎరువుల సరఫరాపై నేడు 'డయల్ యువర్ కలెక్టర్'

విజయనగరం అర్బన్: ఎరువుల సరఫరాపై రైతుల సమస్యలను తెలుసుకునేందుకు, వారి నుంచి సూచనలు, సలహాలు స్వీకరించేందుకు ఆదివారం డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 12 నుంచి 1 గంటల మధ్య ఫోన్ 94419 57315 నంబర్‌కు ఫోన్ చేయాలని కలెక్టర్ సూచించారు.

యూరియా కోసం ఇన్ని కష్టాలా బాబూ..!



సీతానగరం: మండల కేంద్రంలోని గ్రోమోర్ సెంటర్ వద్ద యూరియా కోసం క్యూకట్టిన రైతులు

యూరియా కోసం రైతన్నలు అష్టకష్టాలు పడుతున్నారు. పొలం పని మానుకుని పీఏసీఎస్‌లు, ప్రైవేటు దుకాణాలు, ఆర్‌ఎస్‌కేలకు పరుగుతీస్తున్నారు. రోజంతా మండుటెండలో నిరీక్షిస్తున్నారు. పస్తులతో ఎరువు కోసం పాట్లు పడుతున్నారు. ఆరుగాలం శ్రమించి అందరికీ అన్నంపెట్టే రైతన్నల ఎరువు కష్టం చూసి సభ్యసమాజం తలదించుకుంటోంది. కూటమి ప్రభుత్వ తీరును దుయ్యబడుతోంది. డబ్బులిచ్చి కొనుగోలు చేసే ఎరువు కోసం ప్రైవేటు దుకాణాల వద్ద పడిగాపులు కాయడాన్ని చూసి నివ్వెరపోతోంది. ఎరువుకోసం రైతన్నలకు ఇన్నికష్టాలా 'బాబూ' అంటూ నిట్టూర్పుతోంది. పార్వతీపురం మన్యం జిల్లాలో రైతన్న ఎరువు పాట్లుకు శనివారం కనిపించిన ఈ దృశ్యాలే సజీవసాక్ష్యం.

కొమరాడలో యూరియా కోసం వేచిఉన్న గిరిజనులు



అన్నదాత ఉసురు తగులుతుంది



కొమరాడ గ్రోమోర్ సెంటర్ వద్ద రైతుల నిరీక్షణ

కొమరాడ: మండలంలోని గిరిశిఖర గ్రామాలైన కుంతేస్, పూడేస్, పెదశాఖ, నయా తదితర గ్రామాల రైతుల యూరియా కోసం ఉదయం 7 గంటలకే ఆర్‌ఎస్‌కేలు, ప్రైవేటు దుకాణాల వద్ద పడిగాపులు కాసినా ఎరువు దొరకని పరిస్థితి నెలకొందని, రైతుల ఉసురు కూటమి ప్రభుత్వానికి తగులుతుందని సీపీఎం నాయకులు కొల్లు సాంబమూర్తి, గిరిజన సంఘ నాయకుడు చోడి ఆనంద్ అన్నారు. కొమరాడ గ్రోమోర్ సెంటర్ వద్ద ఎరువు కోసం పడిగాపులు కాసినా చాలా మంది రైతులకు ఎరువు లభించకపోవడంతో ఆందోళన వ్యక్తంచేశారు.



కడగండి సచివాలయం వద్ద యూరియాకోసం రైతన్నల పడిగాపులు

యూరియా పాట్లు

సీతంపేట: యూరియా కోసం రైతులకు అష్టకష్టాలు తప్పడం లేదు. సీతంపేట ఏజెన్సీలోని కడగండి సచివాలయానికి శనివారం 200ల బస్తాల యూరియా మాత్రమే వచ్చింది. ఎరువుకోసం వందలాది మంది రైతులు తరలివచ్చారు. యూరియా దొరక నిరాశతో వెనుదిరిగారు.

గుణానపురంలో యూరియా కోసం మండుటెండలో క్యూ కట్టిన రైతులు





పార్వతీపురం రూరల్: నర్సిపురంలో టోకెన్లు తీసుకున్న వారు వేచి ఉండాలంటూ రైతన్నలను ఆదేశిస్తున్న గ్రామీణ వ్యవసాయశాఖ సిబ్బంది, రూరల్ ఎస్‌ఐ సంతోషికుమారి



తురకనాయుడువలసలో ఎరువు కోసం నిరీక్షిస్తున్న రైతులు

అరకొర ఎరువు

జియ్యమ్మవలస రూరల్: ఈ ఏడాది జియ్యమ్మవలస రైతులకు 1231 మెట్రిక్ టన్నుల యూరియా, 800 మెట్రిక్ టన్నుల డీఏపీ అవసరం ఉంటుందని వ్యవసాయ అధికారి ప్రతిపాదించగా, కేవలం 510 మెట్రిక్ టన్నుల యూరియా, 224 మెట్రిక్ టన్నుల డీఏపీ మాత్రమే వచ్చింది. దీంతో ఎరువు కోసం రైతులకు కష్టాలు తప్పడంలేదు.



మక్కువ గ్రోమోర్ సెంటర్ వద్ద యూరియా కోసం క్యూ కట్టిన రైతులు

పడిగాపులు

మక్కువ: స్థానిక గ్రోమోర్ ఎరువుల కేంద్రానికి 267 బస్తాల యూరియా వచ్చిందని తెలియడంతో రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఒక బస్తా ఎరువుకోసం గంటల తరబడి నిరీక్షించారు. పోలీసుల సమక్షంలో పంపిణీ చేశారు. కొందరు రైతులకు ఎరువు అందలేదు.

టీడీపీ నేత ఇంటికి ఎరువులు

- పీఏసీఎస్ నుంచి అక్రమంగా తరలిస్తూ పట్టుపడిన సొసైటీ అధ్యక్షుడు
- తొలుత సొంతానివంటూ బుకాయింపు
- నకిలీ బిల్లులతో మభ్యపెట్టే ప్రయత్నం



పీఏసీఎస్ అధ్యక్షుడు ఆటోలో తరలిస్తున్న యూరియా బస్తాలను స్వాధీనం చేసుకున్న అధికారులు

సాక్షి, పార్వతీపురం మన్యం: కూటమి నేతల ఇళ్లకు ఎరువులు తరలిపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నా.. అధికార యంత్రాంగం స్పందించిన దాఖలాలు లేవు. సమృద్ధిగా ఎరువులు ఉన్నాయని చెబుతున్న అధికార యంత్రాంగం.. క్షేత్రస్థాయిలో పరిస్థితి తెలిసి కూడా మిన్నకుంటోంది. ఏకంగా పీఏసీఎస్ నుంచి సొసైటీ అధ్యక్షుడే యూరియా, ఎరువులను అక్రమంగా తరలిస్తూ, పట్టుపడిన ఘటన స్వయంగా రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి నియోజకవర్గంలోనే చోటుచేసుకోవడం గమనార్హం.

ఆటోలో తరలింపు.. తొలుత బుకాయింపు

పాచిపెంట పీఏసీఎస్ సొసైటీ నుంచి సాలూరు వైపుగా ఆటోలో 11 యూరియా, 3 పొటాష్ ఎరువు బస్తాలను శనివారం తరలిస్తుండగా పి.కోనవలస చెక్‌పోస్టు సమీపంలో విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ఈ ఎరువులు కేసలి పీఏసీఎస్ అధ్యక్షుడు మాదిరెడ్డి మజ్జారావుకు చెందినవిగా గుర్తించారు. తాను సాలూరు సమీపంలో సుమారు 11 ఎకరాల పామాయిల్ తోటను సాగు చేస్తున్నానని, అక్కడికి తీసుకెళ్తున్నట్లు ఆయన చెబుతూ, బిల్లులను చూపించారు. వాటిని పరిశీలించి.. అవి సరైనవి కాదని విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు తేల్చారు. టీడీపీ నాయకుడు మజ్జారావుపై 6ఏ కేసు నమోదు చేశారు. ఎరువు బస్తాలను పి.కోనవలస రైతు సేవా కేంద్రంలో భద్రపరిచినట్లు విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

పీఏసీఎస్‌లో రికార్డుల నిర్వహణ అస్తవ్యస్తం

కేసలి పీఏసీఎస్‌లో రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదని అధికారులు గుర్తించారు. 154 బస్తాల పొటాష్ అమ్మకాలను నిలుపుదల చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. సాధారణ రైతులు ఎన్ని ఎకరాలు సాగు చేసినా పీఏసీఎస్ ద్వారా కేవలం ఒకట్రెండు బస్తాలు ఇచ్చి పంపించేస్తున్నారని.. ఇలాంటి నాయకులు మాత్రం లోడ్లు తరలించుకుపోతున్నారని స్థానికంగా కర్షకులు ఆవేదన చెందుతున్నారు.

కాకినాడ టు ఒడిశా వయా మన్యం

- పెద్ద ఎత్తున పీడీఎస్ బియ్యం తరలింపు
- పాచిపెంట వద్ద పట్టుకున్న విజిలెన్స్ అధికారులు
- తరలిస్తున్న లారీపై 'జనసేన' పేరు, పార్టీ గుర్తులు



స్వాధీనం చేసుకున్న బియ్యంతో విజిలెన్స్ అధికారులు

సాక్షి, పార్వతీపురం మన్యం/పాచిపెంట: పీడీఎస్ బియ్యం యథేచ్ఛగా తరలిపోతోంది. కాకినాడ కేంద్రంగా కొద్ది రోజులుగా పెద్ద ఎత్తున రవాణా అవుతున్న విషయం విదితమే. అక్కడ నుంచి ఒడిశాకు కూడా తరలిస్తుండడం విశేషం. విజయనగరం, పార్వతీపురం మన్యం మీదుగా శనివారం ఒడిశా రాష్ట్రానికి అక్రమంగా లారీలో తరలిస్తున్న 220 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని పాచిపెంట మండలం పి.కోనవలస చెక్‌పోస్టు సమీపంలో శనివారం విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. కాకినాడ జిల్లా కోట నందిగాం మండలం అల్లంపూడి నుంచి ఒడిశాలోని నౌగాంకు బియ్యాన్ని తరలిస్తున్నట్లు తెలిసింది. చెక్‌పోస్టు వద్ద విజిలెన్స్ సీఐ సింహాచలం సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. విచారణ అనంతరం స్థానిక సీఎస్‌డీటీ హేమలతకు అప్పగించారు. బియ్యాన్ని మంచాడవలస జీసీసీ గోదాంలో భద్రపరిచారు. పట్టుకున్న సరకు విలువ సుమారు రూ.11.53 లక్షలు ఉంటుందని అంచనా. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్సై రామారావు, హెడ్ కానిస్టేబుల్ కామేశ్వరరావు, కానిస్టేబుల్ తిరుపతిరావు ఉన్నారు.

లారీపై 'జనసేన' గుర్తులు

బియ్యాన్ని తరలిస్తున్న లారీపై పెద్ద అక్షరాలతో జనసేన పేరుతో పాటు, ఆ పార్టీ గుర్తులు ఉన్నాయి. జనసేనకు చెందిన నాయకుడి వాహనంగా తెలుస్తోంది. ఆ బియ్యం తరలింపులో పార్టీ వారి పాత్ర ఉందా? లేకుంటే కేవలం లారీనే ఇచ్చారా? అన్నది విచారణలో తేలాల్సి ఉంది.

కేంద్రాస్పత్రిలో సౌకర్యాల కల్పనకు ఆమోదం



పార్వతీపురం రూరల్:జిల్లా కేంద్రాస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రాస్పత్రిలో తాగునీరు, ప్యాన్లు, లైట్లు, ఫర్నీచర్, పెయింటింగ్స్, లిఫ్ట్ నిర్వహణ, మరమ్మతు పనులకు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఆమోదం తెలిపింది. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కేంద్రాస్పత్రి అభివృద్ధి కమిటీ సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఆస్పత్రిలో నీటికొరత లేకుండా చూడాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.శివనాగజ్యోతి మాట్లాడుతూ ఆస్పత్రికి అవసరమైన పరికరాలు, వసతులు కల్పించాలని కోరారు. దీనికి సభ్యులు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, డీసీహెచ్ జి.నాగభూషణరావు, డీఎంహెచ్‌ఓ ఎస్. భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణాలు పూర్తిచేయాలి

పార్వతీపురం రూరల్: గృహనిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. పార్వతీపురం మండలంలోని హెచ్ కారాడవలస, పార్వతీపురం మున్సిపాల్టీకి సంబంధించిన లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలను ఆయన శనివారం పరిశీలించారు. 181 గృహాల్లో కొన్నిమాత్రమే పూర్తిచేయడంపై అధికారులను ప్రశ్నించారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలు వేగంగా పూర్తిచేసుకోవాలని సూచించారు. ఆయన వెంట గృహ నిర్మాణ సంస్థ ఇన్‌చార్జి పీడీ పి.ధర్మచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు ఉన్నారు.

ఎరువుల కోసం ▸ మండుటెండలో నిలబడాలా?

- రైతన్న ఎరువు కష్టాలు ప్రభుత్వానికి పట్టడంలేదు
- రైతుల పక్షాన ఈ నెల 9న వైఎస్సార్‌సీపీ పోరుబాట
- విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పరీక్షిత్‌రాజు పిలుపు



ఈ నెల 9న తలపెట్టనున్న అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పరీక్షిత్‌రాజు, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, పార్టీ నాయకులు

పార్వతీపురం రూరల్: కూటమి ప్రభుత్వ హయాంలో రైతన్నకు కష్టకాలం దాపురించిందని, ఎరువు కోసం మండుటెండలో గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి రావడం దారుణమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు అన్నారు. ప్రభుత్వం సకాలంలో సక్రమంగా ఎరువులు పంపిణీ చేయకపోవడంతో అన్నదాతలు అష్టకష్టాలు పడాల్సి వచ్చిందని వాపోయారు.

పార్వతీపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 9న జిల్లా కేంద్రంలో నిర్వహించబోయే 'ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు'కు సంబంధించిన పోస్టర్లను మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, పార్టీ నాయకులతో కలిసి శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు రైతులకు ఎరువుల పంపిణీలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యార్థులు, మహిళలు, నిరుద్యోగులు, చివరకు రైతులు అవస్థలు పడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రైతుల ఇబ్బందులు పట్టించుకోకుండా అమరావతిలో వర్షాల కారణంగా వచ్చిన వరదనీటిని తోడే పనిలో కూటమి నాయకులంతా నిమగ్నమయ్యారని ఎద్దేవా చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎరువుల కోసం రైతులు నిరీక్షించే పరిస్థితి ఏ రోజు కనిపించలేదన్నారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో ఈ 9న రైతుల తరఫున పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్.శరత్, ఎస్.శ్రీనివాసరావు, పి.సత్యనారాయణ, మల్లిబాబు, ఎం.శేఖర్, రవికుమార్, షఫీ, నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

రైతన్న ఎరువు సమస్యపై కూటమి మొద్దునిద్ర

- పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



అన్నదాతపోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు, స్థానిక నాయకులు

తీవ్రమైన ఎరువు కొరతతో రైతులు సమస్యల్లో ఉంటే కూటమి సర్కార్ మొద్దు నిద్ర వీడడంలేదని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. స్థానిక నాయకులతో కలిసి తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో 'ఎరువుల బ్లాక్‌మార్కెట్‌పై అన్నదాత పోరు' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 9న పార్వతీపురం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద జరగనున్న కార్యక్రమానికి రైతులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. రైతులు ఎరువుల కోసం గంటల తరబడి క్యూలో నిలబడితే దాన్ని బఫే భోజనంతో పోల్చిన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్వతీపుం మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.సత్యనారాయణ, అధికార ప్రతినిధి ఎం.సత్యంనాయుడు, పార్టీ నాయకులు ఎస్. శ్రీనివాసరావు, షేక్‌షఫీ, బి.రవికుమార్, మజ్జి శేఖర్, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఎస్.లావణ్య, టి.బోదయ్య, వై.త్రినాథ, వి.నేతాజీ, నాగరాజు, కోరాడ చిట్టి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

జేసీ శోభిక సేవలు ప్రశంసనీయం



జేసీ శోభికకు జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ ఎస్.వి. మాధవ్‌రెడ్డి, సబ్ కలెక్టర్లు, డీఆర్వో

పార్వతీపురం రూరల్: పార్వతీపురం మన్యం జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గా ఎస్ఎస్ శోభిక అందించిన సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. బదిలీపై వెళ్తున్న ఆమెకు కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు శనివారం వీడ్కోలు పలికారు. ఆమెను దుశ్శాలువలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఎన్నికల నిర్వహణ, ధాన్యం సేకరణలో ఆమె ప్రతిభను కలెక్టర్ ప్రశంసించారు. జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి మాట్లాడుతూ శోభిక పరిపాలనలో మంచి సహాయ సహకారాలు అందించారన్నారు. శోభిక మాట్లాడుతూ జిల్లాలో పనిచేయడం సంతృప్తినిచ్చిందని, అనుభవాలను నేర్పిందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కె.హేమలత, సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవర్ స్వప్నిల్ జగన్నాథ్, డిప్యూటీ కలెక్టర్ ధర్మచంద్రారెడ్డి, దిలీప్‌చక్రవర్తి పాల్గొన్నారు.

అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

పార్వతీపురం రూరల్: జిల్లాలో ఎవరైనా ఎరువులను అధిక ధరలకు విక్రయాలు జరిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ హెచ్చరించారు. జిల్లాలో ప్రస్తుతం 783 మెట్రిక్ టన్నుల యూరియా ప్రభుత్వ, ప్రైవేట్ దుకాణాల్లో నిల్వ ఉందన్నారు.

ఖైదీల ప్రవర్తన గమనించాలి



సూచనలు చేస్తున్న జైళ్ల శాఖ జిల్లా అధికారి మోహనరావు

పాలకొండ రూరల్: రిమాండ్ ఖైదీల ప్రవర్తనను జైలు అధికారులు, సిబ్బంది గమనించాలని ఆ శాఖ జిల్లా అధికారి కె.మోహనరావు సూచించారు. పాలకొండ సబ్ జైలును స్థానిక డీఎస్పీ ఎం.రాంబాబుతో కలిసి శనివారం సందర్శించారు. ఖైదీల ఆరోగ్య రక్షణకు తీసుకుంటున్న చర్యలు, అందుబాటులో ఉన్న వసతులపై ఆరా తీశారు. డీఎస్పీ మాట్లాడుతూ జైలు పరిసరాల్లో ఎటువంటి మారణాయుధాలు ఉండకుండా చూడాలని సూపరింటెండెంట్ బి.జోగులకు సూచించారు. వారి వెంట హెడ్‌వార్డర్ రమణ, ఏఎస్సై శ్రీనివాసరావు, సిబ్బంది నాగరాజు, హేమసుందర్, సత్యారావు, నాయుడు, హరికృష్ణ ఉన్నారు.

రాజ్యలక్ష్మికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మికి ప్రతిష్టాత్మక 'లైఫ్‌ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ఫర్ అకడమిక్ లీడర్‌షిప్'లభించింది. కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కంపెటెన్సీస్ (సీఎస్‌సీ ఇండియా) సంస్థ ఈ అవార్డును ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రదానం చేసినట్టు శనివారం ఓ ప్రకటనలో ఆమె తెలిపారు. ఆమెకు వర్సిటీ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఏపీపీఎస్సీ పరీక్ష కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు

విజయనగరం అర్బన్: జిల్లాలో ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం జరగనున్న ఫారెస్టు బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్ల పరీక్ష కోసం అభ్యర్థులకు సహాయం అందించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ సందేహాల నివృత్తికి కంట్రోల్ రూమ్ నంబర్ 08922- 236947ను సంప్రదించాలని కోరారు.

ముగిసిన నవోదయ స్కూల్ టీచర్ల ఇంటర్వ్యూ

విజయనగరం అర్బన్: జిల్లాలోని జవహర్ నవోదయ స్కూల్‌లో ఉపాధ్యాయుల నియామకం కోసం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో శనివారం నిర్వహించిన ఇంటర్వ్యూ ప్రక్రియ ముగిసింది. జేసీ సేతుమాధవన్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ ప్రక్రియలో పీజీటీ ఇంగ్లిష్ ఒకటి, ఫిజిక్స్ ఒకటి, లెక్కలు రెండు పోస్టుల కోసం ఇంటర్వ్యూలు చేపట్టారు. ఏడాది కాలానికి కాంట్రాక్ట్ విధానంలో పనిచేయాడానికి ఎంపికలు నిర్వహించారు. మెరిట్ అభ్యర్థులను నియమిస్తామని జేసీ తెలిపారు.

క్లుప్తంగా

వ్యాన్ బోల్తా: డ్రైవర్‌కు గాయాలు


బోల్తాపడిన వ్యాన్

వేపాడ: మండలకేంద్రం వేపాడ సమీపంలో కళ్లాల్లో పంచదారతో వెళ్తున్న వ్యాన్ శనివారం బోల్తా పడడంతో డ్రైవర్ గాయాలపాల య్యాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బోడవరం నుంచి ఆనందపురం వేపాడ మీదుగా ఎస్.కోటకు పంచదారతో వెళ్తున్న వ్యాన్ అదుపుతప్పి వేపాడ కళ్లలవద్ద రోడ్డుపై బోల్తాపడింది. దీంతో డ్రైవర్ కృష్ణకు గాయాలు కాగా స్థానిక పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం నిమిత్తం ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి హెచ్‌సి శేషాద్రి, కానిస్టేబుల్ కిషోర్ 108 వాహనంలో తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డెంగీతో వివాహిత మృతి

భోగాపురం: మండలంలోని చిన కవులవాడ (యాతపేట) గ్రామానికి చెందిన వివాహిత మైనపు మంగ (28) డెంగీ వ్యాధి సోకి శనివారం మధ్యాహ్నం మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. రెండు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్న మంగను కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి డెంగీ వ్యాధి సోకి మెదడుకు వ్యాపించిదని నిర్ధారించారు. ఇంతలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మంగ పిచ్చి పిచ్చి పేలాపనలు, వాగడం మొదలు పెట్టింది. దీంతో వ్యాధి తీవ్రం కావడంతో ఆస్పత్రిలో కొన్ని రోజులు ఉంచి వైద్యం అందించాలని వెద్యులు సూచించినప్పటికీ కుటుంబసభ్యులు వినకుండా ఆమెకు దెయ్యం పట్టిందనే అనుమానంతో ఇంటికి తీసుకువచ్చేశారు. దీంతో ఆమెకు వైద్యం అందక చనిపోయింది. మృతురాలికి భర్త నరసింహులుతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గూడ్స్ ఢీకొని వ్యక్తి మృతి

లక్కవరపుకోట: మండలంలోని సంతపేట గ్రామం సమీపంలో కొత్తవలస-కిరండోల్ (కేకే లైన్) రైల్వే ట్రాక్ దాటుతుండగా మార్లాపల్లి గ్రామానికి చెందిన గేదెల దేముడుబాబు (48) గూడ్స్ ఢీకొట్టడంతో శనివారం మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దేముడుబాబు సంతపేట గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నసమారాధనకు రైల్వే ట్రాక్ దాటి వెళ్తుండగా కిరండోల్ నుంచి విశాఖ వెళ్తున్న గూడ్స్ ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో రెండు కాళ్లు తెగిపడ్డాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించి కొన ఊపిరితో ఉన్న దేముడుబాబును ఎస్‌కోట సీహెచ్‌సీకి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసునమోదు చేశారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య


మధు (ఫైల్)

బొబ్బిలి: రాష్ట్రంలో యువత అందరికీ ఉద్యోగాలు కల్పిస్తాం లేకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని పట్టించుకోకపోవడంతో యువత ఆత్మహత్యల బాట పడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో మండలంలోని కృష్ణాపురం గ్రామంలోని రైతు కూలీ కుటుంబానికి చెందిన బలగ మధు(23)అనే యువకుడు బొబ్బిలి సమీపంలోని గున్న తోటవలస సమీపంలోని రైలు కింద పడి శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై రైల్వే పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన బలగ శంకరరావుకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మధుసూదన రావు ట్రిపుల్ ఐటీ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. చిన్న కుమారుడు ఐటీఐ చదువుతున్నాడు. మధు చేస్తున్న ఉద్యోగ ప్రయత్నాలు కలిసి రాకపోవడంతో తరచూ కలత చెందేవాడు. ఈ క్రమంలోనే ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని చెబుతున్నారు. ఉద్యోగం రాకపోతే పోయింది. మా శక్తి ఉన్నంత వరకూ పెంచుతాం. తరువాత ఎప్పుడైనా ఉద్యోగం రాకపోతుందా?మమ్మల్ని అప్పుడు పెంచుతావుకదా? ఇంత ఘోరానికి ఒడిగట్టావా నాయనా అంటూ తల్లి దండ్రులు మృత దేహంపై పడి రోదిస్తున్న తీరు స్థానికులను కలిచివేసింది. మధు మృతి వార్తతో కృష్ణాపురంలో విషాద ఛాయలు అముకున్నాయి. మృతదేహాన్ని బొబ్బిలి ఆస్పత్రికి తరలించిన రైల్వే పోలీసులు పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹145	₹260	₹270

గుట్టుగా బాల్య వివాహాలు..!

- ఈఏడాది 23 నిలుపుదల
- గ్రామాల్లో కానరాని నిషేధ కమిటీ సమావేశాలు
- అనధికారికంగా అధిక సంఖ్యలో జరిగిపోతున్నట్లు ఆరోపణలు

మండలాల వారీగా బాల్యవివాహాల నిలుపుదల

మండలం	నిలిపివేసిన బాల్య వివాహాలు
డెంకాడ	1
మెరకముడిదాం	1
గజపతినగరం	1
బొండపల్లి	1
గరివిడి	1
జామి	1
విజయనగరం	13
రేగిడిఆముదాలవలస	1
రాజాం	1
సంతకవిటి	2



బాల్యవివాహాల నిషేధ చట్టం వాల్ పోస్టర్

విజయనగరం ఫోర్ట్: ఈ ఏడాది జనవరి నెలలో బొండపల్లి మండలంలో 16 ఏళ్ల బాలికకు వివాహం చేయాలని తల్లిదండ్రులు నిర్ణయించారు. ఈ విషయాన్ని చైల్డ్‌లైన్ ట్రోల్‌ఫ్రీ నంబర్ 1098కు ఓ వ్యక్తి సమాచారం అందించాడు. దీంతో చైల్డ్‌లైన్, బాలల సంరక్షణ, పోలీసులు సంబంధిత గ్రామానికి వెళ్లి బాల్య వివాహాన్ని నిలుపుదల చేశారు.

అలాగే విజయనగరం మండలంలో 17 ఏళ్ల బాలికకు వివాహం చేయాలని తల్లిదండ్రులు నిర్ణయించారు. ఈవిషయాన్ని చైల్డ్ లైన్ ట్రోల్‌ఫ్రీ నంబర్ 1098కు ఓ వ్యక్తి ఫోన్ చేసి సమాచారం అందించాడు. దీంతో అధికారులు సంబంధిత గ్రామానికి వెళ్లి బాల్య వివాహాన్ని నిలుపుదల చేశారు. ఈ రెండు చోట్లే కాదు. జిల్లాలో అనేక చోట్ల బాల్య వివాహాలు గుట్టుగా జరిగిపోతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల దృష్టికి వచ్చినవి చాలా తక్కువే. అధికారుల దృష్టికి రాకుండా రహస్యంగా బాల్యవివాహాలు జరిగిపోతున్నట్లు సమాచారం. బాల్య వివాహాలకు అధికారులు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయలేక పోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సమావేశం కాని కమిటీలు

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో బాల్యవివాహ నిషేధ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి పంచాయతీ సర్పంచ్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. పంచాయతీ సెక్రటరీ, వీఆర్వో బాల్య వివాహాల నిరోధక అధికారులుగా వ్యవహరిస్తారు. అయితే ఈ కమిటీ సమావేశాలు ఎక్కడా కానరావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాల్యవివాహం చేయడానికి అస్కారం ఉండే వారిని వీరు గుర్తించి వారిపై దృష్టి సారించాల్సి ఉంటుంది. అనాథ బాలికలు, ఇంట్లో వృద్ధాప్యం బారిన పడిన తాతయ్యలు, మామ్మలు ఉండేచోట బాల్య వివాహాలు చేయడానికి ప్రయత్నిస్తారు. ఇటువంటి చోట్ల బాల్య వివాహాలు చేయకుండా వారికి అవగాహన కల్పించాలి. కాని ఎక్కడా ఈ చర్యలు కానరావడం లేదు.

10 మండలాల్లో ప్రయత్నాలు

జిల్లాలోని 10 మండలాల్లో బాల్యవివాహాలు చేయడానికి బాలికల తల్లిదండ్రులు ప్రయత్నించారు. ఈ 10 మండలాల్లో జనవరి నెల నుంచి ఇప్పటివరకు అధికారులు 23 చోట్ల బాల్య వివాహాలను నిలుపుదల చేశారు.

నిలిపివేస్తామని చెప్పి వివాహాలు

అధికారుల సమక్షంలో బాల్య వివాహాన్ని నిలుపుదల చేసినట్లు ఇరువైపులా తల్లిదండ్రులు చెబుతున్నారు. లిఖిత పూర్వకంగా రాసి ఇస్తున్నారు. అంతటితోనే అధికారులు ఆగిపోతున్నారు. తర్వాత వారు నిజంగానే బాల్య వివాహాలు నిలుపుదల చేశారా? లేదా ఎక్కడైనా వివాహం చేసేశారా అని ఫాలోఅప్ చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని వల్ల అధికారుల ముందు బాల్య వివాహం నిలుపుదల చేసిన తల్లిదండ్రులు మళ్లీ వివాహం జరిపించేస్తున్నారు.

రెండేళ్ల జైలు

బాల్య వివాహాల నిషేధ చట్టం 2006 ప్రకారం బాల్య వివాహాలు చేసిన, ప్రోత్సహించిన వారిపై కేసులు నమోదు చేసి రెండేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధించే అవకాశం ఉంది. ఒక్కోసారి జైలు, జరిమానా విడివిడిగా పడే అవకాశం ఉంది.

బాల్య వివాహాల నిరోధంపై దృష్టి



బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల్లో బాల్య వివాహ నిషేధ కమిటీ సమావేశాలు నెలలో రెండుసార్లు నిర్వహించాలి. ఆ విధంగా జరిగేలా చర్యలు తీసుకుంటాం. **టి.విమలారాణి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి**

ఎరువుల బాధ్యత ప్రభుత్వానిదే

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర


యూరియా కొరతపై మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు రూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే అందించాల్సిన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, యంత్రపరికరాలు సిద్ధం చేసి రైతులకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. అన్నం పెట్టే రైతును ఆదుకుంటేనే అందరి కడుపులు నిండుతాయి. అలాంటిది సెప్టెంబర్ నెల వచ్చినా ఇంకా ఎరువుల కోసం రైతు క్యూలో కాలం వెళ్ల దీయాల్సిన పరిస్థితి వచ్చింది. ఇది కచ్చితంగా ప్రభుత్వం అన్నదాతపై చూపిస్తున్న నిర్లక్ష్యమేనని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ధ్వజమెత్తారు. ఈ మేరకు శనివారం ఆయన తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతు బాంధవుడినని చెప్పుకుంటారని, ప్రస్తుతం రైతులు యూరియా కోసం పడుతున్న తిప్పలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి రైతుపై ఉన్న నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు. పలు సందర్భాల్లో వ్యవసాయం దండగ అన్న చంద్రబాబునాయుడు ఇప్పుడు ఆయన అనుసరిస్తున్న విధానాలతో స్పష్టం చేస్తున్నారన్నారు.

ఏసీ గదుల్లో కూర్చుని నిర్ణయాలు

ఏసీ గదుల్లో కూర్చుని నిర్ణయాలు తీసుకుంటే రైతు కష్టాలు ఎలా తెలుస్తాయి? రోడ్డు మీదకి వచ్చి రైతు ఎరువుకోసం ఎన్ని పాట్లు పడుతున్నాడో చూస్తే అర్థం అవుతుంది. ప్రస్తుతం యూరియా పూర్తిస్థాయిలో ఇచ్చేస్తున్నామని చెబుతున్న వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడికి ఆ యూరియా ఎక్కడికి పోతోందో తెలుసుకోవాల్సిన బాధ్యత లేదా? అని ప్రశ్నించారు.

గత ప్రభుత్వంలో ఆర్బీకేల్లో సేవలు

గత ప్రభుత్వంలో రైతుభరోసా కేంద్రాల్లో రైతుకు సీజన్ ప్రారంభంలోనే ఎరువులు, విత్తనాలు ఏమేరకు అవసరమో సిద్ధం చేసి ఉండేవన్నారు. ఇప్పుడు ఆ రైతు భరోసా కేంద్రాలను కొన్ని చోట్ల అద్దెలకు ఇచ్చేస్తున్నట్లు పత్రికల్లో చూస్తున్నామన్నారు.

ఫేక్‌న్యూస్‌లైతే అనుకూల పత్రికలపై కేసులు పెట్టండి

పత్రికల్లో ఎరువుల కోసం వచ్చిన వార్తలు అన్ని అబద్ధాలేనని కొట్టిపారేస్తున్న మంత్రులు ప్రభుత్వ అనుకూల పత్రికల్లో దారిమళ్లిన ఎరువులు అని బ్యానర్ వార్తలు రాసిన పత్రికలపై ముందు కేసులు పెట్టాలన్నారు. మీకు అనుకూల పత్రికల్లో కూడా వైఎస్సార్‌సీపీ నాయకులే రాయించేశారా? అని రాజన్నదొర ప్రశ్నించారు సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్ గిరి రఘు, మాజీ కౌన్సిలర్ పిరిడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చర్చలకు రానప్పుడు అసత్య ఆరోపణలు ఎందుకు?

- టీడీపీ నాయకులపై గిరిజన ప్రజా ప్రతినిధుల మండిపాటు


మాట్లాడుతున్న గిరిజన ప్రజాప్రతినిధులు

పాచిపెంట: అభివృద్ధిపై చర్చలకు రానప్పుడు తెలుగుదేశం పార్టీ నాయకులు అసత్య ఆరోపణలు ఎందుకు చేస్తారని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గిరిజన ప్రజా ప్రతినిధులు సోములు లచ్చయ్య, మాదల సింహాచలం, డోనేరు లచ్చయ్యలు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు, సభలు సమావేశాలు, ప్రచార మాధ్యమాలలో గత ప్రభుత్వం గిరిజన అభివృద్ధిని విస్మరించిందని, ఒక్క అభివద్ధి పని కూడా చేయలేదని మాట్లాడుతున్నారన్నారు. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలుగుదేశం పార్టీ నాయకులు ఎవరైనా చర్చకు రావాలని సవాల్ విసరగా, కొందరు తెలుగుదేశం పార్టీ నాయకులు ఆ సవాల్ స్వీకరించి, మండల కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు చర్చకు వస్తామని తెలియజేశారన్నారు. అయితే తాము చర్చ ప్రదేశానికి వెళ్లగా తెలుగుదేశం పార్టీ నాయకులు ఎవరూ రాలేదన్నారు, స్వయంగా మేమే మళ్లీ వారికి ఫోన్ చేసి మాట్లాడగా శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు వస్తానని తెలియజేశారని శనివారం కూడా రాలేదన్నారు. చర్చించే ధైర్యం లేనప్పుడు సవాళ్లు ఎందుకు స్వీకరిస్తారని ఎందుకు అసత్యఆరోపణలు చేస్తారని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ఎవరైనా ఎప్పుడైనా అభివృద్ధిపై చర్చకు వస్తామంటే తాము ఎప్పుడూ ఆధారాలతో సిద్ధంగా ఉంటామని పత్రికా ముఖంగా మరోసారి తెలుగుదేశం పార్టీ నాయకులకు తెలియజేశారు.

రాణికట్ వ్యాధితోనే లక్షలాది కోళ్ల మృతి

- పశువర్ధకశాఖ ఎ.డి కన్నంనాయుడు


రామలింగాపురం సమీపంలో ఖాళీ అయిన పౌల్ట్రీఫామ్


రామలింగాపురం గ్రామం సమీపంలో ఒక పౌల్ట్రీలో చనిపోయిన కోళ్లను గొయ్యి తీసి పాతిపెడుతున్న దృశ్యం

కొత్తవలస: ఇటీవల కొత్తవలస, లక్కవరపుకోట మండలాల్లో అంతుచిక్కని వ్యాధితో లక్షలాది కోళ్లు మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా కోళ్లు రాణికట్ వ్యాధితోనే చనిపోతున్నాయని ఈ మేరకు విజయవాడ సెంట్రల్ లేబొరేటరీ నుంచి నివేదికలు అందాయని పశువర్ధకశాఖ కొత్తవలస ఎ.డి కన్నంనాయుడు శనివారం తెలిపారు. కోళ్ల మృతికి బర్డ్‌ఫ్లూ కారణం కావని నిర్ధారణ జరిగినట్లు చెప్పారు. లక్షలాది కోళ్ల మృతికి కారణం రాణికట్ వ్యాధే కారణమని స్పష్టం చేశారు. దీనివల్ల ప్రజారోగ్యానికి ఎటువంటి ముప్పులేదన్నారు. కాగా మరోపక్క కోళ్ల మృతులు మాత్రం ఆగడం లేదు. పౌల్ట్రీ కోళ్ల కన్నా దేశవాళీ కోళ్లే అధిక సంఖ్యలో మృతి చెందుతున్నాయి. లక్షలాది కోళ్ల మృతికి కారణం బర్డ్‌ఫ్లూ కారణమని ప్రభుత్వం ప్రకటిస్తే రైతులకు నష్టపరిహారం ఇవ్వాల్సి వస్తుందని, అందుకే ఆ వ్యాధిగా ప్రభుత్వం ప్రకటించ లేదని కొంతమంది పౌల్ట్రీ రైతులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. గడిచిన 20 రోజులుగా కోళ్లు మృతిచెందినా అధికారులు పట్టించుకోక ప్రస్తుతం కొత్తరకం రాణికట్ అనే వ్యాధిని తెరపైకి తెచ్చారని రైతులు ఆరోపిస్తున్నారు. పక్క రాష్ట్రమైన ఒడిశా రాష్ట్రంలో ప్రస్తుతం బర్డ్‌ఫ్లూ వ్యాధి ఉందని ఆ వైరసే మన పౌల్ట్రీలకు సోకిందని రైతులు వాపోతున్నారు. మరోపక్క కోళ్ల మృతులు ఆగక పోవడంతో పదుల సంఖ్యలో పౌల్ట్రీలు ఖాళీ అవుతున్నాయి. రైతుల ఆరోపణపై ఎ.డి కన్నంనాయుడిని వివరణ కోరగా లేబొరేటరీలో పరీక్షల అనంతరం రాణికట్ వ్యాధిగా నిర్ధారణ అయిందన్నారు. రైతుల ఆరోపణలో వాస్తవం లేదన్నారు. వైరస్ తగ్గు ముఖం పట్టిన వెంటనే వ్యాక్సిన్ వేస్తామన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి స్పోర్ట్స్‌మీట్


విజేతలకు జ్ఞాపికలు అందిస్తున్న నిర్వాహకులు

రాజాం: స్థానిక జీఎంఆర్ వరలక్ష్మి డీఏవీ స్కూల్‌లో రెండురోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్ శనివారం ముగిసింది. జీఎంఆర్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ జె.గిరీష్, సీఏఓ సుప్రియోభట్టాచార్య తదితరులు ఈ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని ప్రారంభించి పర్యవేక్షించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి 22 డీఏవీ పాఠశాలలకు చెందిన 561 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వారిలో విజేతలకు పాఠశాల ఆవరణలో జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జీఎంఆర్ఐటీ స్టూడెంట్స్ ఫెడరేషన్ డీన్ రాంబాబు, జీసీఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. పురుషోత్తమరావు, పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

దుష్ట సంప్రదాయానికి పరాకాష్ఠ

- జెడ్పీచైర్మన్ ఫ్లెక్సీలు చింపివేసిన దుండగులపై ఫిర్యాదు


సీఐకి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

బొబ్బిలి: పట్టణంలో కొత్త దుర్మార్గానికి తెరతీశారు గుర్తు తెలియని దుండగులు. ఇటీవల జెడ్పీ చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా బొబ్బిలి పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకున్నారు. వాటిని శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు బ్లేడ్, చాకుతో కోసినట్టు చించేశారు. అభిమానంగా పెట్టుకున్న ఫ్లెక్సీలకు కూడా రాజకీయ దుర్బుద్ధితో ఇలా చించడం సరికాదంటూ చూసిన వారు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ఇదే సంప్రదాయం కొనసాగించే అవకాశం ఉందని దీనిని కొనసాగించకుండా అడ్డుకోవాలని ఆలోచించిన వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, మున్సిపల్ కౌన్సిలర్లు ఎస్ రామకృష్ణ, పాలవలస ఉమా శంకర్, ఇంటి గోవిందరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి దుండగులను గుర్తించాలని, కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని సీఐని కోరారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ కూడలి వద్ద ఓ మహిళ పసి పాపతో రిక్షాలో వెళ్తున్న క్రమంలో రిక్షాను వెనకనుంచి లారీ ఢీకొట్టడంతో రిక్షా చక్రం రహదారిపై ఉన్న గుంతలో ఒక్కసారిగా దిగిపోయింది. దీంతో రిక్షా ఒక్కసారిగా పక్కకు వాలిపోవడంతో రిక్షాలో ఉన్న మహిళ, పసిపాప రోడ్డుపై పడి తేలికపాటి గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో రిక్షాకు ఉన్న చక్రం గుంతలో దిగి ధ్వంసమైంది. అదృష్టవశాత్తు పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులంతా భావించారు.


రిక్షాను పక్కకు తీసేందుకు సాయం చేస్తున్న స్థానికులు

మళ్లీ జగన్‌ను సీఎం చేయడమే లక్ష్యం

- కూటమి పాలనపై 15 నెలల్లో ప్రజా వ్యతిరేకత
- సూపర్ సిక్స్ పేరుతో నయవంచన
- యూరియా కోసం రైతులు రోడ్లెక్కడం దారుణం
- రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం, డ్రగ్స్, గంజాయితో అఘాయిత్యాలు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుదు కల్యాణి


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కల్యాణి, చిత్రంలో విజయనగరం డిప్యూటీ మేయర్ శ్రావణి

విశాఖ సిటీ: కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చిన 15 నెలల్లోనే తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని, మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకోవడమే లక్ష్యమని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుదు కల్యాణి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం మద్దిలపాలెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జోన్-1 మహిళా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వ అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. అలాగే జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోడానికి కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని తీర్మానించారు. అనంతరం ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలను, ముఖ్యంగా మహిళలను నిట్టనిలువుగా మోసం చేసిందని ఆరోపించారు. మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. ఎన్నికలకు ముందు అప్పటి సీఎం జగన్ కంటే ఎక్కువ మేలు చేస్తానని సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తర్వాత వాటిని నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారన్నారు. ఎప్పుడూ చూడని విధంగా రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారన్నారు. కేంద్రం పూర్తి స్థాయిలో యూరియాను సరఫరా చేసినప్పటికీ వాటిని టీడీపీ నేతలు బ్లాక్ మార్కెట్ తరలించారని ఆరోపించారు.

మహిళలకు రక్షణ లేదు

రాష్ట్రంలో హోం మంత్రిగా మహిళ ఉన్నప్పటికీ మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం మద్యాన్ని విచ్చలవిడి చేసేసిందని విమర్శించారు. 80 వేల బెల్టుషాపులు పుట్టుకొచ్చాయని, పర్మిట్ రూమ్‌లకు కూడా అనుమతులు ఇచ్చేశారని తెలిపారు. మద్యం కారణంగానే మహిళలపై దాడులు పెరుగుతున్నాయని చెప్పారు. అలాగే రాష్ట్రంలో డ్రగ్స్ డోర్ డెలివరీ జరుగుతోందని, గంజాయిని హోంమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలోనే పండిస్తున్నారని వివరించారు. వాటిని అరికట్టడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందన్నారు. గుడిలో ఉన్న దేవుడిని వెలివేసి మళ్లీ దేవుడు రావాలని ప్రార్థిస్తున్నామని ప్రజలు బాధపడుతున్నారన్నారు. రానున్న మూడేళ్లు ప్రజల తరపున పోరాటం చేయడానికి, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడానికి వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, విజయనగరం డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, రాష్ట్ర మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు అధిక సంఖ్యలో మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు రూ.81 వేల కోట్ల బకాయి

కూటమి ప్రభుత్వం రైతులకు మొదటి ఏడాది పెట్టుబడి సాయం ఎగ్గొట్టి వెన్నుపోటు పొడిచిందన్నారు. మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 చొప్పున ఇస్తానని చెప్పి ఒక్కో మహిళకు రూ.22,500 బాకీ పడిందని తెలిపారు. నిరుద్యోగ భృతి రూ.3 వేల కింద ఇప్పటి వరకు రూ.45 వేలు బకాయి ఉందన్నారు. 50 ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు రూ.4 వేల పెన్షన్ ఇవ్వకపోగా కొత్తగా ఒక్కరికి పింఛన్ గానీ, రేషన్ కార్డు గానీ మంజూరు చేయలేదన్నారు. పైగా రాష్ట్రంలో 3 లక్షల మంది అర్హులైన వారి పెన్షన్ తొలగించిందని వెల్లడించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఇవ్వడం లేదన్నారు. ఇలా మొత్తంగా రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం రూ.81వేల కోట్లు బాకీ పడిందని వివరించారు. మహిళలకు ఉచిత బస్సు అని చెప్పి 16 రకాల బస్సులు ఉంటే.. కేవలం 5 రకాల బస్సుల్లో అవకాశం కల్పించారన్నారు. అలాగే ఉచితంగా మూడు సిలిండర్లు అని చెప్పి ఒకటి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు.